## క్లుప్తంగా

### ప్రత్యేక బస్సులు వినియోగించుకోండి

**మదనపల్లె సిటీ:** నూతన ఆంగ్ల సంవత్సరానికి ప్రముఖ పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌కు నడపనున్న ప్రత్యేక బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి హార్సిలీహిల్స్‌కు 12 బస్సులు, బి.కొత్తకోట నుంచి హార్సిలీహిల్స్‌కు నాలుగు, కాండ్లమడుగు క్రాస్ నుంచి హార్సిలీహిల్స్‌కు 10 బస్సులు నడుపుతామన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్యకొండకు ఆరు బస్సులు నడపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని కోరారు.

### దాడి కేసులో నిందితుల అరెస్టు

**తంబళ్లపల్లె:** మండలంలోని గంగిరెడ్డిపల్లెకు చెందిన ఎం.గంగిరెడ్డి (70)పై కొడవలితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితులను సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్.ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. నిందితులు హసీనా (38), మున్నా (38), షాహిద్(23), ముబారక్ (24),దౌలత్‌బీ (73), నాగూర్ (42)లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

### నియామకం

**ములకలచెరువు:** బీజేపీ మండలాధ్యక్షుడిగా వేపూరికోటకు చెందిన జయరాం రెడ్డిని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. పార్టీ అభ్యున్నతికి కృషిచేస్తానని జయరాం రెడ్డి ఈ సందర్భంగా అన్నారు. కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### శివమ్మ సేవలు మరువలేనివి

**బి.కొత్తకోట:** స్థానిక కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంలో గ్రేడ్‌వన్ మెడికల్ ఫార్మాసిస్ట్‌గా పని చేస్తూ ఉద్యోగ విరమణ చేసిన శివమ్మ సేవలు మరువలేనివని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ కుమార్ కొనియాడారు. సోమవారం ఆస్పత్రిలో ఆమెకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె అందించిన సేవలను ప్రస్తావించారు. వైద్యులు హసీనా బేగం, ఆరీఫుల్లా, నర్సారెడ్డి, దుర్గాదేవి, ఉద్యోగులు, సిబ్బంది సత్కరించారు.

### మరుగుదొడ్ల నిర్మాణాల తనిఖీ

**పెద్దతిప్పసముద్రం:** మండలంలోని రంగసముద్రం పంచాయతీ కుర్రావాండ్లపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పూర్తయిన వ్యక్తిగత మరుగుదొడ్డిని సోమవారం ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణం రూ.37 వేల అంచనాతో ప్రారంభం కాగా మండలానికి మంజూరైన 14 అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్మాణ పనులు పూర్తి అయినట్లు జేఈ వెల్లడించారు.

### మాజీ ఎమ్మెల్యే పరామర్శ

**కలికిరి (వాల్మీకిపురం) :** నియోజకవర్గంలోని కురబలకోట మండలం తూగువారిపల్లికి చెందిన కదిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి(షిర్డీ) తండ్రి కె. నరసింహారెడ్డి ఇటీవల మృతి చెందాడు. సోమవారం ఉత్తర క్రియలు కార్యక్రమం సందర్భంగా పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తూగువారిపల్లికి చేరుకుని నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుని కుమారుడు శ్రీకాంత్‌రెడ్డిని పరామర్శించారు. నాయకులు ఆనందరెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్యే వెంట పాల్గొన్నారు.

### జాతీయస్థాయి డ్యాన్స్ పోటీలకు ఎంపిక

**మదనపల్లె సిటీ:** మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లె సూర్య డ్యాన్స్ అకాడమీకి చెందిన విద్యార్థినులు జాతీయ స్థాయి డ్యాన్స్ పోటీలకు ఎంపికయ్యారు. లిఖితశ్రీ, జస్మిత శ్రీ, నందినిలు కూచిపూడిలో రాణించడంతో పంజాబ్ రాష్ట్రం ఘర్‌శంకర్‌లో వచ్చే నెల 17,18 తేదీల్లో జరిగే జాతీయ స్థాయి డ్యాన్స్ చాంపియన్‌షిప్-25 పోటీల్లో పాల్గొంటారు. ఈ విషయాన్ని డ్యాన్స్ అకాడమీ నిర్వాహకులు సూర్యకుమార్ తెలిపారు. ఈ విద్యార్థులు ఇటీవల సత్యసాయి జిల్లా కదిరిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభను కనబరిచారు. దీంతో వీరిని జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

### జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**పీలేరురూరల్ :** స్థానిక జెడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వ్యాసరచన, చిత్రలేఖన, సంప్రదాయ నృత్యం తదితర పోటీల్లో ప్రతిభ చూపినట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం సురేంద్రనాథరెడ్డి తెలిపారు.సోమవారం పాఠశాలలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28,29వ తేదీలలో తిరుపతిలో బాలోత్సవం పిల్లల పండుగ సందర్భంగా తమ పాఠశాల నుంచి 15 విద్యార్థులు పాల్గొని ప్రశంసాపత్రి, బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ

**పెద్దతిప్పసముద్రం:** యూటీఎఫ్ మండల శాఖ నాయకులు సోమవారం నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓలు నారాయణ, గౌస్‌పీర్‌లచే ఆవిష్కరింపజేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ఉపాధ్యాయులు ముందుకు సాగాలని ఎంఈఓలు సూచించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని నాయకులు శంకర్, శ్రీరాములు, శివ, ఆంజనేయులు, మీనా, బషీర్, నాగరాజు పేర్కొన్నారు.

# తగ్గుతున్న టమాట ధర

- మార్కెట్లో కిలో రూ.10
- బయటరాష్ట్రాల్లో దిగుబడితో ధరలు పతనం
- వర్షాలకు భారీగా తగ్గిన దిగుబడి
- ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతుల డిమాండ్


రవాణాకు సిద్ధంగా ఉంచిన టమాటాలు

**గుర్రంకొండ:** టమాట ధరలు మార్కెట్లో గత వారం రోజులుగా రోజు రోజుకు పతనమవుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ. రూ.10 పడిపోయింది. రైతులు లబోదిబో మంటున్నారు. బయటరాష్ట్రాల్లో టమాటా దిగుబడులు వస్తుండడంతో అక్కడి వ్యాపారులు మన జిల్లాకు రావడం లేదు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు తోటలు దెబ్బతిని దిగుబడి తగ్గు ముఖం పడుతోంది. జిల్లాలో పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, మదనపల్లె, అంగళ్లు, ములకలచెరువు మార్కెట్‌యార్డు పరిధిలో ప్రస్తుతం 34వేల ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వస్తోంది. రాయలసీమ జిల్లాలైన అనంతపురం, వైఎస్సార్ జిల్లా, శ్రీసత్యసాయి జిల్లాలో కూడా ప్రస్తుతం టమాటా దిగుబడులు వస్తుండడంతో మార్కెట్లలో టమాటా ధరలు రోజుకు రోజుకు పడిపోతుండటం గమనార్హం.

**దిగుబడి లేకున్నా ధర లేకపాయె**

జిల్లాలోని పడమటి మండలాల పరిధిల్లో ప్రస్తుతం 34 వేల ఎకరాల్లో టమాటా దిగుబడి వస్తోంది. ప్రతి ఏడాది ఈసీజన్‌లో 40వేల నుంచి 54 వేల ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వచ్చేది. ఇటీవల కురిసిన వర్షాలకు టమాటా తోటలు బాగా దెబ్బతిన్నాయి. పంట దిగుబడి అత్యల్పంగా వస్తోంది. గత ఏడాది ఇదే సీజన్‌లో అత్యధికంగా 56 వేల ఎకరాల్లో టమాటా పంట దిగుబడి వచ్చింది.

**సాగు ఖర్చులు కూడా రావు**

గత 25 రోజుల క్రితం ఉన్న టమాటా ధరలతో పోల్చుకొంటే ప్రస్తుతం 65 శాతం మేరకు ధరలు తగ్గిపోయాయి. 20 రోజులు కిందట 25 కేజీల టమాటా క్రేట్ ధరలు అత్యధికంగా రూ.650 నుంచి రూ.800 వరకు ధరలు ఉన్నాయి. అయితే ప్రస్తుతం ఒక క్రేట్ ధర రూ. 250 లోపే ధరలు పలుకుతున్నాయి. వారం రోజులుగా మార్కెట్లో టమాటా ధరలు రోజురోజుకు తగ్గిపోతుండడంతో రైతులు అందోళన చెందుతున్నారు. ఇవే ధరలు నిలకడగా ఉంటే కనీసం పంట సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

**వర్షాలకు దెబ్బతిన్న తోటలు**

ఇటీవల కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు, మారిన వాతావరణం కారణంగా టమాటా తోటలు భారీగా దెబ్బతిన్నాయి. పూత, పిందె గతంతో పోలిస్తే 50 శాతం కూడా నిలబడటం లేదు. కాయలు కూడా త్వరగా రంగుతేలిపోవడంతో పాటు పలుచోట్ల టమటాలపై మచ్చలు వస్తున్నాయి. దీంతో పంట దిగుబడి 40 శాతం మేరకు తగ్గిపోయింది. ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో పాటు పంట దిగుబడి తగ్గిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**బయట రాష్ట్రాలల్లో దిగుబడి ఎక్కువ**

బయట రాష్ట్రాలతో పాటు రాయలసీమ జిల్లాలో టమాటా దిగుబడి నిలకడ వస్తుండడంతో ఇక్కడి టమాటా ధరలు పెరగడం లేదని వ్యాపార వర్గాలు అంటున్నాయి. చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్‌తోపాటు రాయలసీమ జిల్లాలైన అనంతరపుం, శ్రీసత్యసాయి. వైఎస్సార్ జిల్లాలో టమాటా దిగుబడులు ప్రారంభమయ్యాయి. దీంతో బయట రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడకు రావడం లేదు. ఇక్కడి టమాటాలు బయట రాష్ట్రాలకు ఎగుమతి చేయక పోవడంతో ధరలు తుగ్గుముఖం పట్టాయి. స్థానిక వ్యాపారులే టమాటాలను కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**ప్రభుత్వం వైపు రైతుల చూపు**

మార్కెట్లో టమాటా ధరలు అత్యధికంగా పలుకుతున్నప్పుడు ధరలు తగ్గించి విక్రయించాలని మార్కెట్ అధికారులను ఆదేశించే ప్రభుత్వం నేడు తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. 25 కిలోల టమాటా క్రేట్ ధర గతంలో రూ. 2500 ఉన్నప్పుడు ప్రభుత్వం మార్కెట్లో ధరలు తగ్గించి రూ.1000కే ప్రజలకు అందించిన దాఖలాలు ఉన్నాయి. నేడు ధరలు తగ్గుముఖం పడుతున్నందన ప్రభుత్వమే గిట్టుబాటు ధరలు కల్పించి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రభుత్వమే కొనుగోలు చేయాలి**

మార్కెట్లో టమాటా ధరలు తగ్గిపోతుండడంతో ప్రభుత్వం చొరవచూపి రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలి. టమాటా ధరలు అత్యధికంగా ఉన్నప్పుడు రైతుల దగ్గర ప్రభుత్వం తగ్గించి కొనుగోలు చేసి ప్రజలకు అందించింది. ఇప్పుడు ధరలు తగ్గిపోయినందున ప్రభుత్వమే రైతులును ఆదుకోవాలి.

- వెంకటరమణ, రైతు, మొరంపల్లె

**ధరలు తగ్గుముఖం పట్టాయి**

మార్కెట్లో టమాటా ధరలు రోజురోజుకు తగ్గుముఖం పడుతున్నాయి. బయటరాష్ట్రాల వ్యాపారులు జిల్లాకు రావడంలేదు. దీంతో టమాటా ధరలు ఆశించినంతగా పెరగడం లేదు. వారంరోజులుగా మార్కెట్‌కు టమాటాలు వస్తున్నా ఆశించినంత ధర పెరగలేదు. వర్షాలకు ఇక్కడి టమాటా తోటలు దెబ్బతిన్నాయి.

- కుమార్‌రెడ్డి, కార్యదర్శి, వాల్మీకిపురం మార్కెట్ కమిటీ

## రేషన్ డీలర్ల నోటిఫికేషన్ రద్దుచేయాలి

- సబ్ కలెక్టరేట్‌లో టీడీపీ నాయకుల హంగామా
- ఎమ్మెల్యే మనుమ్యలకు హాల్‌టికెట్లు ఇవ్వలేదంటూ అధికారులతో వాగ్వాదం
- సబ్ కలెక్టర్ జోక్యంతో సద్దుమణిగిన వివాదం


హాల్‌టికెట్ల మంజూరులో అన్యాయం జరిగిందంటూ సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

**మదనపల్లె :** మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో రేషన్‌షాపు ఖాళీలకు సంబంధించి విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దుచేసి, మరోసారి నిర్వహించాలంటూ టీడీపీ నాయకులు సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో హంగామా చేశారు. ఎమ్మెల్యే మనుష్యులకు ఎవ్వరికీ హాల్‌టికెట్లు అందలేదని, రెవెన్యూ అధికారులు ఉద్దేశపూర్వకంగా వారికి కావాల్సిన వ్యక్తులకే హాల్‌టికెట్లు అందించారని ఆరోపిస్తూ సబ్ కలెక్టరేట్ సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు. రేషన్‌షాపు పరిధిలో నివాసం లేని వ్యక్తులకు అర్హత కల్పించి హాల్‌టికెట్లు ఇచ్చారన్నారు. స్థానికంగా నివాసం ఉండి, అన్ని అర్హతలు ఉన్న తమ దరఖాస్తులను కావాలనే తిరస్కరించారని, తమకు న్యాయం జరగకపోతే ఊరుకునేది లేదంటూ అధికారులను బెదిరించారు. హాల్‌టికెట్ల మంజూరులో రెవెన్యూ అధికారులు తమకు అన్యాయం చేశారంటూ ఆక్రోశం వెల్లగక్కారు. సబ్ కలెక్టరేట్ కార్యాలయంలో ఉన్నటువంటి తహసీల్దార్ ఖాజాబీని నిలదీశారు. దీంతో సబ్ కలెక్టరేట్ సిబ్బంది సమాచారాన్ని సబ్ కలెక్టర్‌కు తెలపడంతో ఆయన కార్యాలయానికి వచ్చి వారి సమస్యను తెలుసుకునేందుకు ప్రయత్నించారు. సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మాట్లాడుతూ... కార్యాలయంలో గొడవ చేయడం భావ్యం కాదన్నారు. ఒకొక్కరుగా తమ సమస్యలపై అర్జీ రూపంలో నివేదిస్తే... అర్హతలు ఉన్నవారికి హాల్‌టికెట్స్ అందజేస్తామన్నారు. సీఎస్ డీటీ రెడ్డెప్ప సస్పెన్షన్‌కు రెకమెండ్ చేస్తూ, సరెండర్ చేసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి సిఫారసు చేస్తామన్నారు.

### అందరికీ శుభాలు కలగాలి


ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

**బి.కొత్తకోట:** నూతన ఏడాది 2025లో తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలందరికి శుభాలు కలగాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు నూతన ఆంగ్ల సంవత్సరాది శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు కష్టాలు తొలగి, సుఖశాంతులతో జీవించాలని కోరుకొంటున్నానని అన్నారు. వ్యవసాయ కుటుంబాలు పాడి పంటలతో కళకళలాడాలని ఆశిస్తున్నానని చెప్పారు.

### మైనింగ్ మాఫియాపై మంత్రికి ఫిర్యాదు

**కేవీపలె :** మండలంలోని అడవిపల్లె రిజర్వాయర్‌కు ప్రమాదకరంగా ఉన్న మైనింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు పీలేరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ ఫిర్యాదు చేశారు. సోమవారం విజయవాడలో మంత్రిని కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవీపల్లె మండలంలో 1.1418 టీఎంసీ సామర్థ్యంలో కొండలను ఆధారం చేసుకుని అడవిపల్లె రిజర్వాయర్ పనులు చేపట్టారన్నారు. అయితే ప్రాజెక్టుకు ముప్పు వాటిల్లే విధంగా కొందరు నిషేధిత పేలుడు పదార్థాల ఉపయోగించి కొండలను కొట్టి వ్యాపారం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇది వరకు జిల్లా కలెక్టర్‌కు, ముఖ్యమంత్రి కార్యాలయంలో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. అడవిపల్లె రిజర్వాయర్‌ద్వారా ప్రజలకు సాగునీరు, తాగునీరు అందించాలని ప్రభుత్వం చూస్తున్న సమయంలో కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం కొండలు కొడుతూ రిజర్వాయర్‌కు ప్రమాదం జరిగిలే చేస్తున్నారని తెలిపారు. మంత్రి స్పందించి అడవిపల్లె రిజర్వాయర్‌ను కాపాడాలని కోరారు.

## అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసన


నిరసన చేస్తున్న దళిత సంఘ నాయకులు

**ములకలచెరువు:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దళిత సంఘ నాయకులు మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమిత్‌షాను మంత్రి పదవి నుంచి వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీ, బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసం అంబేడ్కర్ కృషి చేశారన్నారు. అటువంటి మహావ్యక్తిని తక్కువ చేసి మాట్లాడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో బాస్ నాయకులు మంత్రాల రమణ, సీపీఐ నాయకులు అంజప్ప, వెంకటరమణ, మల్లికార్జున రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సైన్సు ప్రదర్శనలతో విద్యార్థుల్లో విజ్ఞానం


విద్యార్థులు తయారు చేసిన ఎగ్జిబిట్‌ను తిలకిస్తున్న న్యాయనిర్ణేతలు


సైన్స్ ఫెయిర్‌లో ప్రదర్శించిన నమూనాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

**మదనపల్లె సిటీ:** సైన్సు ప్రదర్శనలతో విద్యార్థుల్లో విజ్ఞానం, వికాసం పెంపొందుతుందని ఎంపీడీఓ తాజ్‌మస్రూర్ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలామ్ విజన్-2024 సైన్సు ఎగ్జిబిషన్ జరిగింది. ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. ఇలాంటి సైన్సు ప్రదర్శనలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు సైన్సు, టెక్నాలజీ అంశాలపై అవగాహనతో పాటు చదువు మీద ఆసక్తి కలుగుతుందన్నారు. ఇందులో వ్యక్తిగత విభాగంలో వెహికల్ పొల్యూషన్ కంట్రోల్ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించిన నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి లక్ష్మి వెంకటేష్, గైడ్ టీచర్ సి.అంజలి, గ్రూపు విభాగంలో రెయిన్ సెన్సింగ్ హార్వేస్టర్ క్రాప్ ప్రొటెక్టర్ ఎగ్జిబిట్ ప్రదర్శించిన వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రాజేష్, గైడ్ టీచర్ రమణయ్య, ఉపాధ్యాయుల విభాగంలో మంకీ గన్ ఎగ్జిబిట్ ప్రదర్శించిన వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాల టీచర్ శోభరాణిలను ఉత్తమ ఎగ్జిబిట్‌లు ఎంపిక చేశారు. వీరు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభగల విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు ప్రభాకర్‌రెడ్డి, రాజగోపాల్, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, న్యాయ నిర్ణేతలుగా వరప్రసాద్, రసూల్ బావాజీ, అన్వర్‌సాదత్, పి.మహమ్మద్‌ఖాన్, విద్యార్థులు పాల్గొన్నారు.

**మండల స్థాయి సైన్స్ ఫెయిర్**

**ములకలచెరువు:** మండలంలోని బురకాయలకోట జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం మండల స్థాయి సైన్స్ ఫెయిర్ నిర్వహించినట్లు ఎంఈఓ వెంకటరమణ అన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన నమూనాల్లో వ్యక్తిగత కేటగిరిలో మోడల్ స్కూల్ విద్యార్థిని శైలజ, గ్రూప్ కేటగిరిలో బురకాయలకోట జెడ్పీ హైస్కూల్‌కు చెందిన అఫ్రా, ప్రణీత్‌రెడ్డిలు, ఉపాధ్యాయుల భాగంలో గీతాంజలిలు మొదటి స్థానంలో నిలిచారు.

**అంగళ్లులో సైన్స్ ఫేర్**

**కురబలకోట:** మండలంలోని అంగళ్లు జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం నాగవేణి ఆధ్వర్యంలో సోమవారం సైన్స్ ఫేర్ నిర్వహించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు వివిధ నమూనాలు ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓలు ద్వారకనాథ్, శ్రీనివాసులు హాజరై సైన్స్ ఆవిష్కరణలు, సాంకేతిక నైపుణ్యతను తెలియజేశారు.

**సైన్సు మేళా**

**తంబళ్లపల్లె:** సైన్సు మేళా కార్యక్రమాలతో విద్యార్థులలో ఆలోచన, సృజనాత్మకత శక్తి, విజ్ఞానం పెంపొందుతుందని ఎంఈఓలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడు తెలిపారు. సోమవారం స్థానిక ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్సు మేళా జరిగింది. ఎనిమిది పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని ప్రాజెక్టు నమూనాలను ప్రదర్శించారు. కన్నెమడుగు ఉన్నత పాఠశాల గైడ్ టీచర్ ఎల్ఎస్ శాస్త్రి ఆధ్వర్యంలో విద్యార్థులు కె.వర్షిత, ఓ.దీపికలు వేస్ట్ టు ఎనర్జీ ఎగ్జిబిట్‌ను ప్రదర్శించిన నమూనా ,మహాత్మాపూలే బీసీ పాఠశాల గైడ్ టీచర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థి శేషాద్రి ప్రదర్శించిన దర్డ్ ఐ బ్లయిండ్ ప్రాజెక్టు నమూనాను జిల్లా స్థాయికి ఎంపిక చేసిన ఎంఈఓ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, పాఠశాల చైర్మన్ శివకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పశువులు, కోళ్ల పెంపకంపై శిక్షణ


రైతులకు వ్యవసాయ వస్తువులను అందజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

**కలికిరి:** స్థానిక కేవీకే కార్యాలయంలో పశువులు, కోళ్ల పెంపకంలో శాస్త్రీయ పద్ధతులపై సోమవారం రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేవీకే కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ రైతులు వ్యవసాయంతో పాటు పాడి సంపదపై దృష్టి సారిస్తే అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. పాడిపశువులు, కోళ్ళు పెంపకంలో శాస్త్రీయ పద్ధతుల అవలంభనతో వ్యాధులు రాకుండా నివారించవచ్చని వివరించారు. అనంతరం గ్రామప్రియ కోళ్లు, తార్పాలిన్ పట్టలు, డ్రమ్ములు, సికెచర్స్ తదితర వస్తులను ఎస్సీ ఉప ప్రణాళిక పథకంలో భాగంగా అందజేశారు. కార్యక్రమంలో కేవీకే పశువైద్య శాస్త్రవేత్త డా. నవీన, మర్రికుంటపల్లి హరిజనవాడ, అండేకురవపల్లి, ముడియంవారిపల్లి, బాలంవారిపల్లి రైతులు, మహానంది వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యక్తిత్వంతోనే సమాజంలో గుర్తింపు

- ఎంపీడీఓ శ్రీధర్‌రావు


ఏఓ దంపతులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, కార్యాలయం సిబ్బంది

**పెద్దమండ్యం:** ఏ స్థాయిలో అధికారిగా పనిచేస్తున్నా వ్యక్తిత్వం ఉంటే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని ఎంపీడీఓ శ్రీధర్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ పదవీ విరమణ చేస్తున్న వెంకటేశ్వరరావుకు సోమవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ 37 సంవత్సరాల పాటు ఉద్యోగ ప్రస్థానాన్ని చూసిన ఏఓ వెంకటేశ్వరరావు మంచి వ్యక్తిత్వం గల వారని కొనియాడారు. ప్రజాప్రతినిధులు, కార్యాలయం సిబ్బంది తో పెద్దమండ్యంలో ఐదున్నర సంవత్సరాల పాటు తమ సేవలందించారన్నారు. ఈ సందర్భంగా ఏవోను ప్రజాప్రతినిధులు, కార్యాలయం సిబ్బంది, సచివాలయ సిబ్బంది ఘనంగా దుశ్శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్‌కుమార్, ఎంఈవో మనోహర, ఏపీవో మురళి, హౌసింగ్ ఏఈ అక్రమ్, మాజీ జెడ్పీటీసీ గుర్రం రమేష్, సర్పంచ్‌లు సోదనపల్లె బాషా, జింకా విశ్వనాధ, కంటి విశ్వనాధరెడ్డి, ఎంపీటీసీ మంచూరి జయరాం, నాయకులు రామిరెడ్డి, కేశవ, తిరుపాల్‌నాయక్ పాల్గొన్నారు.

## నీటి సమస్య పరిష్కరించాలని నిరసన

**పెద్దతిప్పసముద్రం:** తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని రంగసముద్రం పంచాయతీ సాలేవాండ్లపల్లి ప్రజలు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రభుత్వ బోరుతో పాటు పైప్‌లైన్ సౌకర్యం ఉన్నా ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నీటి ఎద్దడి నెలకొందన్నారు. గత ఏడాది నుంచి ప్రజలు తాగునీటి కోసం అలమటిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారన్నారు. నీళ్ల కోసం రైతుల వ్యవసాయ బోర్ల వద్దకు వెళితే ఛీదరించుకుంటున్నారని ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. సమస్యపై ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, మెకానిక్ చంద్రశేఖర్ స్పందించారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ బోరుకు పక్కనే ఉన్న రైతుల వ్యవసాయ బోర్ల విద్యుత్ సహాయంతో తాత్కాలికంగా నీటి సమస్యను పరిష్కరించి రెండు నెలల్లో శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

## ఎంపీడీఓపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

**బి.కొత్తకోట:** తంబళ్లపల్లె ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి రాజకీయ నాయకుడిగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలంటూ మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. తంబళ్లపల్లె మండల మీట్ నిర్వహించాలంటే ఎప్పుడు నిర్వహించేది ఎంపీపీ అనుమతి ద్వారా తేదిని నిర్ణయించాలి, తదుపరి సభ్యులకు, సర్పంచులు, అధికారులకు సమాచారం ఇవ్వాలి. అయితే ఇవేమి లేకుండానే ఎంపీడీఓ తన ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ నిర్ణయాలు తీసుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై సబ్‌కలెక్టర్ ఆరా తీశారు. మండల మీట్ నిర్వహణకు ఎంపీపీ అనుమతి ఇవ్వలేదని, కనీసం సమావేశ నిర్వహణపై సమాచారం కూడా లేదని వివరించారు. దీనితో తాము మండలమీట్‌కు హాజరుకాలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

## అసమానతలు పాటిస్తే క్రిమినల్ కేసులు

**కలకడ :** ఎస్సీ, ఎస్టీలపై అసమానతలు పాటిస్తే క్రిమినల్ కేసులు తప్పవని తహసీల్దార్ ఫణికుమార్ హెచ్చరించారు. సోమవారం మండలంలోని ఎనుగొండపాళ్యం పంచాయతీ బండమీద ఎస్సీ కాలనీలో, కదిరాయచెర్వు పంచాయతీలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. చట్టం దృష్టిలో అందరూ సమానులే అని, ఎస్సీ, ఎస్టీలపై దురుసుగా ప్రవర్తించినా, వివక్షకు గురిచేసినా అట్రాసిటి కేసు పరిధిలోకి వస్తారని గుర్తు చేశారు. చట్టంపై ప్రతి ఒక్కరూ కనీస అవగాహన కలిగి ఉండాలని కోరారు. గ్రామానికి వీధిలైట్లు, స్మశానవాటికకు స్థలం కేటాయించాలని గ్రామస్తులు విన్నవించారు.

## హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాలు నడపాలి


హెల్మెట్‌పై పోలీసుల అవగాహన ర్యాలీ

**పీలేరు రూరల్ :** ద్విచక్రవాహన దారులు విధిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని సీఐ యుగంధర్ అన్నారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి క్రాస్ రోడ్డు వరకు పోలీసులు హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు ప్రమాదాలు అరికట్టేందుకు ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే కారులో ప్రయాణించేవారు విధిగా సీటుబెల్టు ధరించాలని కోరారు. ప్రమాదాల్లో ఎక్కువశాతం హెల్మెట్, సీటు బెల్టు ధరించక ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు బాలకృష్ణ, లోకేష్ పాల్గొన్నారు.

## దారి సమస్యపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

**పీలేరు రూరల్ :** మండలంలోని వేపులబైలు పంచాయతీ రెడ్డివారిపల్లె, గాయంవారిపల్లె రైతుల పొలాలకు దారి సమస్య పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ భీమేశ్వర్‌రావుకు ఫిర్యాదు చేశారు. 30, 40 సంవత్సరాలుగా సర్వే నెంబరు 1316/11 డీకేటీ భూమిలో దారి ఉండేదని తెలిపారు. అయితే ఒకరిద్దరు రైతులు దారిని బ్లాక్ చేశారని తెలిపారు. సర్వే చేపట్టి దారి సమస్య కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పి. రత్నశేఖర్‌రెడ్డి, సుబ్రమణ్యం, రవి, చంద్రమోహన్ రెడ్డి, అమరనాథరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### న్యాయవాదులు విధుల బహిష్కరణ

**తంబళ్లపల్లె:** అనంతపురం సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతి సంఘటనకు నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరించినట్లు తంబళ్లపల్లె బార్ అసోసియేషన్ కార్యదర్శి గఫూర్ తెలిపారు. సోమవారం కోర్టులోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో సమావేశమయ్యారు. అనంతపురం సీనియర్ న్యాయవాది శేషాద్రి మృతికి సంతాపం తెలిపారు. త్రీటౌన్ సీఐ, పోలీసుల వేధింపులతోనే న్యాయవాది శేషాద్రి మృతి చెందినట్లు ఆరోపించారు. సివిల్ కేసుకు సంబంధించి లిఖితపూర్వక ఫిర్యాదు లేకుండానే స్టేషన్‌కు పిలిపించి వేధించిన తీరును ఖండించారు. సోమ, మంగళవారం రెండు రోజులు విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. న్యాయవాదులు సిద్దలింగారెడ్డి, అరుణ్‌కుమార్, నాగమల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.